
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 26.0 । కనిష్ఠం : 22.0

ANDHRAJYOTHY 5

నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు

శనివారం 27 సెప్టెంబరు 2025





జోగుళాంబ అమ్మవారి సన్నిధిలో సినీ నిర్మాత బండ్ల గణేశ్

జోగుళాంబను దర్శించుకున్న ప్రముఖులు

7

మహిళల అభ్యున్నతికి కృషి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి
- బాల్య వివాహాలను అరికట్టాలి
- ఎస్పీ రావుల గిరిధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, చిత్రంలో ఎస్పీ రావుల గిరిధర్, జిల్లా అధికారులు

వనపర్తి రాజీవ్ చౌరస్తా, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహిళల అభ్యున్నతికి కృషి చేయాలని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం 'మన కోసం - మన పిల్లల కోసం' నినాదంతో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల అభివృద్ధే లక్ష్యంగా యూనిసెఫ్ సహకారంతో, సెర్ప్ ఆధ్వర్యంలో ప్రభుత్వం 'స్నేహ' అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. బాల్య వివాహం చేస్తే కుటుంబ సభ్యులతో పాటు, ప్రోత్సహించిన వారు కూడా శిక్షార్హులని చెప్పారు. ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత అందరిపై ఉందన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ సందర్భంగా పోక్సో కేసుపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శించిన స్కిట్ అందరినీ ఆకట్టుకున్నది. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసులు, డీఆర్డీవో ఉమాదేవి, డీడబ్ల్యూవో సుధారాణి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి అంజయ్య, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వరూప తదితరులు పాల్గొన్నారు.



సిర్సవాడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ నది



భారీ వర్షంతో యాదిరెడ్డిపల్లి సమీపంలోని పత్తి చేనులో చేరిన నీరు

జడివాన

- గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు వర్షం
- సిర్సవాడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న 'దుందుభి'
- నాలుగు మండలాలకు నిలిచిపోయిన రాకపోకలు
- మల్దకల్ మండలంలో 98.2 మిల్లీ మీటర్ల వర్షపాతం
- అయిజ వద్ద పొంగి పొర్లుతున్న పోలోని వాగు
- ఎమ్మిగనూరు, మంత్రాలయం వైపు నిలిచిన రాకపోకలు



జలదిగ్బంధంలో అయిజ ప్రభుత్వ ఆస్పత్రి



వనపర్తి జిల్లా కేంద్రంలో వర్షంలో గొడుగు పట్టుకొని వెళ్తున్న యువతులు

నాగర్‌కర్నూల్ టౌన్/ తాడూరు/ వనపర్తి/ గద్వాల/ అయిజ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో జడివాన కురుస్తోంది. గురువారం రాత్రి ప్రారంభమైన వర్షం శుక్రవారం పొద్దస్తమానం కురుస్తూనే ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో సగటు వర్షపాతం 31.56 మిల్లీమీటర్లుగా నమోదయ్యింది. దీంతో జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. తాడూరు మండలంలోని దుందుభీ నదికి గంటగంటకూ వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో సిర్సవాడ నుంచి కల్వకుర్తి, ఊర్కొండ, మిడ్జిల్, తలకొండపల్లి మండలాలకు వెళ్లే ప్రధాన లింకు రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాలతో పత్తి పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

● వనపర్తి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. జిల్లా కేంద్రంలో పొద్దస్తమానం ముసురు పడ్తూనే ఉండటంతో ప్రజలంతా ఇళ్లకే పరిమితమయ్యారు. రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. జిల్లాలోని చెరువులు, వాగుల్లో నీటి ప్రవాహం పెరిగింది. రంగసముద్రం రిజర్వాయర్ నిండడంతో ఒక గేటు తెరిచి నీటిని విడుదల చేస్తున్నారు. పెద్దమందడి మండలంలో అత్యధికంగా 42.3 మిల్లీమీటర్లు, అత్యల్పంగా పాన్‌గల్ మండలంలో 18.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. వర్షాలు మరో రెండు రోజుల పాటు కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు సూచించారు.

● జోగుళాంబ గద్వాల జిల్లాలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉన్నది. జిల్లాలోని మల్దకల్ మండలంలో 98.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. అత్యల్పంగా ఎర్రవల్లి మండలంలో 41.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వర్షంతో పలుచోట్ల రహదారులు జలమయం అయ్యాయి. జనజీవనం స్తంభించింది. అయిజ పట్టణ సమీపంలోని పాలోని వాగు పొంగి పొర్లుతోంది. దీంతో మంత్రాలయం, ఎమ్మిగనూర్ వైపు వెళ్లే వాహనాలను పోలీసులు నిలిపి వేశారు. దీంతో ఆయా ప్రాంతాలకు కర్ణాటక మీదుగా వెళ్లాల్సి వస్తోంది.

ఉత్తనూర్ వాగు కూడా పొంగి పొర్లుతోంది. దీంతో ఉత్తనూర్, భూమ్‌పూర్, సిందనూర్ గ్రామంలో జలదిగ్బంధంలో ఉండిపోయాయి. అయిజ పట్టణంలో లోతట్టు ప్రాంతాలైన మడ్డిగుంత, గాజులపేట, దుర్గానగర్, బోయపేట, తెలుగుపేట వీధులు జలమయమయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రి చుట్టూ నీరు నిలిచింది. శుక్రవారం సాయంత్రం బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాలకృష్ణలు పాలోనివాగును పరిశీలించారు. వాగుపై వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. లేకపోతే ఆందోళన చేపడతా మన్నారు.

చెరువులకు చేరని చేపలు




రేకులపల్లి వద్ద కృష్ణానదిలో వల విసురుతున్న మత్స్యకారుడు

- ఇప్పటి వరకు పూర్తి కాని టెండరు ప్రక్రియ
- స్థానిక ఎన్నికల పనుల్లో అధికారులు నిమగ్నం
- చేప పిల్లల కోసం మత్స్యకారుల ఎదురుచూపులు

6

కరెంటు పోతే కష్టాలేనా?

- టీ-హబ్‌లో వైద్య పరీక్షలకు అంతరాయం
- గంటల తరబడి నిరీక్షణతో రోగుల అవస్థలు
- అధిక సామర్థ్యం గల జనరేటర్ లేకపోవడమే సమస్య



విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీకట్లో సీటీ స్కానింగ్ ఆపరేటింగ్ రూం

వనపర్తి వైద్యవిభాగం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రంలోని టీ-హబ్ కేంద్రంలో విద్యుత్ సరఫరా ఉంటేనే వైద్య పరీక్షలు జరిగే పరిస్థితి నెలకొన్నది. నిరుపేద రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, వారిపై ఆర్థిక భారం పడకుండా చూడాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో (టీ హబ్) రోగ నిర్ధారణ పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి అధునాతన యంత్రాలను ఏర్పాటు చేశారు. కానీ వాటి సామర్థ్యానికి తగిన విద్యుత్‌ను అందించే జనరేటర్‌ను మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడల్లా వైద్య పరీక్షలు నిలిచిపోయి, రోగులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో దాదాపు 6 గంటలకు పైగా రోగులు వైద్య పరీక్షల కోసం నిరీక్షించాల్సి వచ్చింది.

200 హెచ్‌పీ జనరేటర్ అవసరం

టీ హబ్‌లోని అధునాతన యంత్రాలకు సరిపడా విద్యుత్తును సరఫరా చేసే సామర్థ్యమున్న జనరేటర్‌ను ఏర్పాటు చేయలేదు. దీంతో ట్రాన్స్‌కో ద్వారా వచ్చే విద్యుత్‌పైనే ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుతం ఉన్న జనరేటర్ ఫ్యాన్లు, లైట్లు వంటి చిన్న చిన్న అవసరాలకు మాత్రమే సరిపోతోంది. కానీ ఎక్స్‌రే, స్కానింగ్ వంటి యంత్రాలు పని చేయాలంటే 200 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన జనరేటర్ అవసరం ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. అంతే కాకుండా ఉన్న జనరేటర్‌ను కూడా టెక్నీషన్స్ లేకపోవడంతో వినియోగించుకునే పరిస్థితి లేక, విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ప్రతీసారి రోగులు, సిబ్బంది చీకట్లోనే ఉండాల్సి వస్తోంది.

ప్రతీ నెల 432కు పైగా స్కానింగులు

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, అర్బన్ హెల్త్ సెంటర్లు, జిల్లా జనరల్ ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రాల నుంచి వివిధ రకాల వైద్య పరీక్షల కోసం సేకరించిన రక్త నమూనాలను టీ హబ్‌కు పంపిస్తుంటారు. ప్రతీ నెల దాదాపు 432 నుంచి 500 మందికి సీటీ స్కానింగ్‌లు, 500కు పైగానే ఎక్స్‌రేలు తీస్తున్నారు. విద్యుత్ సరఫరా లేకపోతే ఈ యంత్రాలు పని చేసే పరిస్థితి లేదు. అలాంటి సమయాల్లో సీటీ స్కానింగ్, ఎక్స్‌రే పరీక్షల కోసం రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. శుక్రవారం ఉదయం 6:30 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మధ్యాహ్నం 12:45 గంటలకు కరెంట్ వచ్చింది. వైద్య పరీక్షల కోసం వచ్చిన రోగులు అప్పటి వరకు ఎదురుచూస్తూ కూర్చున్నారు. కోట్ల రూపాయల ఖర్చుతో కోట్ల ఖర్చుతో ఏర్పాటు చేసిన ఆధునిక యంత్రాలు ఉన్నా, వాటి సామర్థ్యానికి తగిన విద్యుత్ సరఫరా చేసేందుకు జనరేటర్ లేకపోవడం ఇబ్బందిగా మారింది.

సమస్య తీవ్రత వాస్తవమే



టీ హబ్‌లో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉన్న మాట వాస్తవమే. ప్రస్తుతం ఉన్న జనరేటర్ సామర్థ్యం సీటీ స్కానింగ్, ఎక్స్‌రే వైద్య పరీక్షలకు సరిపోవడం లేదు. ఈ సమస్య ఇప్పటికే కలెక్టర్, టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారుల దృష్టిలో కూడా ఉంది. సమస్య పెద్దది కాబట్టి మా చేతుల్లో ఏమీ లేదు. ప్రభుత్వం స్పందించి 200 హెచ్‌పీ సామర్థ్యం గల జనరేటర్‌ను ఏర్పాటు చేస్తేనే సమస్య పరిష్కారం అవుతుంది.

- డాక్టర్ రంగారావు, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్



కరెంట్ లేకపోవడంతో స్కానింగ్, ఎక్స్‌రే కోసం నిరీక్షిస్తున్న రోగులు, వారి సహాయకులు

మన్మోహన్‌సింగ్, చాకలి ఐలమ్మలు
సమాజానికి స్ఫూర్తి

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నవ భారత నిర్మాణానికి కృషి చేసిన మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్, దొరల పాలనకు చరమగీతం పాడిన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మలు సమాజానికి స్ఫూర్తి అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మన్మోహన్‌సింగ్, చాకలి ఐలమ్మల జయంతి వేడుకలను శుక్రవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కొత్త బస్టాండ్ వద్దనున్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో పాటు ఐలమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో అనేక సంస్కరణలకు ఆద్యుడు మన్మోహన్‌సింగ్ అన్నారు. అగ్రకులాలు, భూస్వాముల ఆధిపత్యానికి ఎదురొడ్డి నిలిచి పోరాడిన చైతన్యవంతురాలు చాకలి ఐలమ్మ అన్నారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్, నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీశ్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ బీ కృష్ణ, ఎస్ఎల్ఎన్ రమేశ్, జీజే శ్రీను, మాజీ కౌన్సిలర్లు బాపనిపల్లి వెంకటేశ్, చీర్ల సత్యం సాగర్, బ్రహ్మంచారి, శ్రీహరి రాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు
సన్నద్ధం కావాలి

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్
- సిబ్బందికి తొలి దశ శిక్షణా తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం తొలి దశ శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు దేవసహాయం, అమరేందర్, డిప్యూటీ సీఈవో గోపాల్‌నాయక్, డీపీవో శ్రీరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. ప్రతీ అధికారి ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతో జరుగుతున్నందున అవసరమైన ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నామినేషన్ల పరిశీలన, గుర్తుల కేటాయింపు తదితర కీలక అంశాల్లో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. శిక్షణ తరగతుల్లో డీఆర్‌డీఏ అదనపు పీడీ రాజేశ్వరి, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు, ఎన్నికల సిబ్బంది, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పట్టణ రూపురేఖలు మారుతాయి

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

6

శ్రీధనలక్ష్మీ పూజయామి!



రూ. 5.50 కోట్ల కరెన్సీ నోట్లతో ధనలక్ష్మీ దేవి అలంకరణలో గద్వాలలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలోని అమ్మవారు



శాంతినగర్ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఘహాలక్ష్మీదేవిగా వాసవీమాత



జడ్చర్లలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కుబేరస్వామి, శ్రీనీలదేవి సమేత ధనలక్ష్మీ దేవిగా అమ్మవారు



కల్వకుర్తి పట్టణంలో ధనలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన వాసవీమాత



నారాయణపేట అంబభవానీ ఆలయంలో లక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు.



అచ్చంపేటటౌన్ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీమహాలక్ష్మిగా దర్శనమిస్తున్న అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు ధనలక్ష్మీ దేవిగా భక్తుల పూజలందుకున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని రూ. 5,55,55,555లతో అలంకరించి పూజలు చేశారు. కొల్లాపూర్‌లో రూ.1.40 కోట్లు, అచ్చంపేటలో రూ. 11,11,111, కల్వకుర్తిలో రూ. 11 లక్షలతో వాసవీ కన్యకాపరమేశ్వరిని ధనలక్ష్మీ దేవిగా అలంకరించారు.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్

సహజ వనరులను రాబోయే తరాలకు అందించాలి

» పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్



సెమినార్‌లో మాట్లాడుతున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సహజ వనరులను రాబోయే తరాలకు అందించాలని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పాలమూరు యూనివర్సిటీలోని ఫార్మసి ఆడిటోరియంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోటని, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎన్విరాన్మెంట్ సైన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ రమేష్‌బాబుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతరం అభివృద్ధి జరగాలని, సమాజంలో ఉన్నటువంటి వాతావరణం, జంతువులు, పక్షులు, సహజ వనరులు భవిష్యత్‌తరాలకు అందించే బాధ్యత ప్రతీ విద్యార్థిపై ఉంటుందని తెలిపారు. యూనివర్సిటీకి వచ్చిన ప్రతీ విద్యార్థి కనీసం పది మొక్కలు నాటి, రెండు సంవత్సరాలు కాపాడే బాధ్యత తీసుకోవాలన్నారు. ముఖ్యవక్త సీనియర్ ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం చాలా దేశాలలో తాగడానికి నీరు, తినడానికి తిండి లేక సతమతమవుతున్నాయని, ప్రకృతిని కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పీజీ ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

చెట్టును బైక్ ఢీకొని యువకుడి మృతి



ఏటవలి రవి (ఫైల్)

గోపాల్‌పేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై అతివేగంతో వెళ్లి చెట్టు ఢీ కొని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన పూర్తి వివరాల ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలం, వడ్డెమాన్‌కు చెందిన రవి(37) గ్రామంలో మేస్త్రీ పని చేసుకుని జీవిస్తున్నాడు. ఆరు రోజల కిందట రవి తండ్రి కాశన్న మృతిచెందాడు. శుక్రవారం ఇంట్లో చిన్నపాటి గొడవ చోటుచేసుకుంది.

దీంతో రవి తన అత్తగారి ఇంటికి బయలుదేరుతానని చెప్పి వనపర్తిలోని బాలనగర్‌కు స్కూటీపై బయలుదేరాడు.

రాత్రి ఎనిమిది గంటల సమయంలో మండలంలోని తాడిపర్తి గ్రామంలో బస్టాండ్ సమీపంలో వేగంగా వెళ్లి చెట్టును ఢీకొట్టాడు. దీంతో రవి తల చేతులకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, ఆటోలో వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రవిని పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడుకి భార్య, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన వారు వారం రోజుల్లో ఇద్దరు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నరేశ్ కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వీపనగండ్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తూముకుంట గ్రామానికి చెందిన మండ్ల కురుమయ్య (45) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఇలా ఉన్నాయి.

తూముకుంటకు చెందిన కురుమయ్య గురువారం తన వరి పంటకు మందు పిచికారి చేయడానికి వెళ్లాడు. రాత్రి సమయంలో అస్వస్థతకు గురికావడంతో మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ... శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య సుల్తానమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

చెరువులకు చేరని చేపలు

- ఇప్పటి వరకు పూర్తి కాని టెండరు ప్రక్రియ
- స్థానిక ఎన్నికల పనుల్లో అధికారులు నిమగ్నం
- చేప పిల్లల కోసం మత్స్యకారుల ఎదురుచూపులు



చేప పిల్లలు

చివరి దశలో టెండరు ప్రక్రియ



టెండర్ ప్రక్రియ చివరి దశలో ఉంది. ఫైనాన్షియల్ బిడ్ తెరిచిన వెంటనే నెగోషియేషన్ చేసి కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకుంటాము. జిల్లా అధికారులు స్థానిక సంస్థల ఎన్నికల బిజీలో ఉండటం కారణంగా కొంత ఆలస్యం అయ్యింది త్వరలో పూర్తి చేస్తాం.

- షకీలాబాను, జిల్లా మత్స్యశాఖ అధికారి

గద్వాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల ఉపాధికి దోహదపడుతున్న ఉచిత చేపపిల్ల పంపిణీ పథకం సక్రమంగా ముందుకు సాగడం లేదు. గత ఏడాది టెండర్ల ప్రక్రియను ప్రభుత్వం ఆలస్యంగా చేపట్టింది. బిల్లులు అందలేదని కాంట్రాక్టర్లు పెద్దగా ఆసక్తి చూపలేదు. అదును దాటిన తర్వాత చేప పిల్లలను చెరువులు, రిజర్వాయర్లలో వదిలారు. అవి సరిగ్గా ఎదగకపోవడంతో మత్స్యకారులు నష్టపోయారు. అలాగే ఈ ఏడాది కూడా ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను ఆలస్యంగా ప్రారంభించింది. ఈ నెలాఖరునాటికి చేపపిల్లల పంపిణీ జరుగుతుందని భావించినా, ఇప్పటి వరకు టెండర్ల ప్రక్రియనే పూర్తి కాలేదు. జోగుళాంబ గద్వాల జిల్లాలో చేప పిల్లల పంపిణీకి ఇద్దరు టెండర్లు వేసినా, ఇప్పటి వరకు ఫైనాన్షియల్ బిడ్‌ను తెరవలేదు. ఆ తర్వాత నెగోషియేషన్ ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించడంతో, ఆ పనుల్లో అధికారులు బిజీ అయిపోయారు. దీంతో టెండర్ల ప్రక్రియ పూర్తికి అంతరాయం ఏర్పడింది.

టెండరు వేసిన ఇద్దరు కాంట్రాక్టర్లు

జిల్లాలో చేప పిల్లల పంపిణీకి ఇద్దరు కాంట్రాక్టర్లు టెండర్లు వేశారు. ఇందులో శివగణి సీడ్స్ వారు ప్రతీ సంవత్సరం టెండర్‌ను దక్కించుకుంటున్నారు. గత నాలుగేళ్లుగా చేపపిల్లలను వీరే సరఫరా చేస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా కృష్ణా జిల్లా, చావల మర్రికి చెందిన వినాయక్ సీడ్స్ కాంట్రాక్టర్ టెండర్ వేశారు. ఇద్దరు టెండర్లు వేయడంతో టెక్నికల్ బిడ్ ఓపెన్ చేశారు. కానీ ఫైనాన్షియల్ బిడ్‌ను ఇప్పటివరకు అధికారులు తెరువలేదు. స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు, ఓటర్ల జాబితా రూపకల్పన, సిబ్బందికి శిక్షణ తదితర పనుల్లో అధికారులు వారం రోజులుగా బిజీగా ఉన్నారు. దీంతో మత్స్యశాఖ అధికారులకు సమయం కేటాయించడం లేదు. అందుకు మరో రెండు రోజుల సమయం పట్టొచ్చని తెలుస్తోంది. అంటే దసరా తర్వాతే టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది.

ఆలస్యంతో ఎదగని చేపలు

చేపపిల్లల పంపిణీ ప్రతీ సంవత్సరం ఆలస్యంగానే జరుగుతోంది. చెరువులలో వదిలే చేప పిల్లల సైజు 35 నుంచి 40 మిల్లీమీటర్లు ఉంటాయి. అవి ఎదగడానికి 6 నెలల సమయం పడుతుంది. ఆలోపు చెరువులలో నీటి మట్టం తగ్గిపోతుంది. చేపలు ఎక్కువ బరువు పెరగాలంటే ఫిబ్రవరి వరకు ఆగాల్సి ఉంటుంది. అప్పటికే నీటి మట్టాలు తగ్గిపోవడంతో చేపల ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. దీంతో ఏటా మత్స్యకారులు నష్టపోతున్నారు. గతంలో ప్రతీ సంవత్సరం 1.69 కోట్ల చేప పిల్లల పంపిణీ జరిగేది. గత ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని సగానికి తగ్గించింది. గత ఏడాది 90 లక్షల చేపపిల్లలను మాత్రమే వదిలారు. దీని వల్ల కూడ మత్స్యకారులు నష్టపోయారు.

జిల్లాలో 7వేల మంది మత్స్యకారులు

జోగుళాంబ గద్వాల జిల్లాలో దాదాపు 7 వేల మంది మత్స్యకారులున్నారు. ముదిరాజ్‌లు అందరూ దాదాపు ఈ వృత్తిపైనే ఆదారపడి ఉన్నారు. మొత్తం 94 మత్స్యకార సహకార సంఘాలు ఉన్నాయి. జిల్లాలో 441 చెరువులు ఉన్నాయి. అందులో 40 పెద్ద చెరువులు, 375 మధ్యతరహా చెరువులు 26 చిన్న కుంటలు ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో నిండుగా కళకళలాడుతున్నాయి. వీటితో పాటు 8 రిజర్వాయర్లు ఉన్నాయి. ఎత్తిపోతల పథకాల ద్వారా నీరు నింపడంతో నిండుకుండల్లా మారాయి. ఈ నేపథ్యంలో చేపపిల్లలను ఎప్పుడు పంపిణీ చేస్తారా అని మత్స్యకారులు ఎదురు చూస్తున్నారు.

కోరలు చాస్తున్న కాలుష్యం

- దాని బారిన వ్యవసాయ భూములు, చెరువులు, కుంటలు
- వర్షం పడిందంటే కాలుష్యం నీటిని వదులుతున్న ఫార్మా పరిశ్రమలు
- నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్న పోలేపల్లి సెజ్‌లోని పరిశ్రమలు
- అధికారులు చర్యలు తీసుకోకపోతే పరిశ్రమను తగులబెడతానంటూ ఎమ్మెల్యే జనంపల్లి అల్టిమేటం



జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని అరబిందో ఫార్మా పరిశ్రమ నుంచి వదిలిన కాలుష్యం నీరు

జడ్చర్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు వాయు కాలుష్యం, మరో వైపు నీటి కాలుష్యాన్ని వెదజల్లుతుండడంతో రైతుల వ్యవసాయ భూములు, చెరువులు, కుంటలు కాలుష్యం బారిన పడుతున్నాయి. వర్షం పడిందంటూ ఆ పరిశ్రమలకు పండగ అనే విధంగా వ్యవహరిస్తున్నాయి. వర్షం నీటితో పాటు పరిశ్రమలోని కాలుష్యం నీటిని యథేచ్ఛగా వదులుతున్నారు. ఇదేంటని ప్రశ్నించిన రైతులకు ఎవరికి చెప్పుకుంటావో... చెప్పుకో పో అంటూ దబాయిస్తున్నారు. ఇదంతా ఎక్కడో మారుమూల ప్రాంతంలో జరుగుతుందంటే పొరపాటు పడినట్లే. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని పోలేపల్లి సెజ్‌లో అంతర్జాతీయ స్థాయి ఖ్యాతి పొందిన ఫార్మ పరిశ్రమల నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్నారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జడ్చర్ల మండలంలోని పోలేపల్లి సెజ్‌లో అంతర్జాతీయస్థాయి ఖ్యాతి కలిగిన ఫార్మ పరిశ్రమలు వదులుతున్న కాలుష్యంతో సెజ్ సమీపంలోని గుండ్లగడ్డతండా, పోలేపల్లి, ముదిరెడ్డిపల్లి, రాయపల్లి పరిసర ప్రాంతాలలో భూగర్భ జలాలు కాలుష్యమయ్యాయి. సమీపంలోని చెరువులు, కుంటలు సైతం కాలుష్యం బారిన పడడంతో వాటిలో వదిలిన చేపలు మృత్యువాత పడిన సంఘటనలున్నాయి. వ్యవసాయ పంటలు పండించేందుకు అనువుగా లేనివిధంగా కాలుష్యం బారిన వ్యవసాయ భూములు ఉన్నాయంటూ వ్యవసాయ శాఖ అధికారులు సైతం ఉన్నత అధికారులకు నివేదికలు సమర్పించిన సంఘటనలున్నాయి. కాలుష్యంను వదులుతున్న పరిశ్రమల అంశంపై బాధిత రైతులు గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా, సెజ్‌లోని దాదాపు 11 పరిశ్రమలకు జరిమానాలు విధించిన సంఘటనలున్నాయి. వీటితో పాటు పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు సైతం పలు పర్యాయాలు ఫిర్యాదులు చేశారు. కానీ పరిశ్రమల వద్ద తనిఖీలు నిర్వహించిన అధికారులు, చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరించారంటూ రైతులు బహిరంగంగానే ఆరోపించారు. ఈ అంశాన్ని బాధిత రైతులంతా జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం, అసెంబ్లీలో సైతం ప్రస్తావించినా, ఫార్మ పరిశ్రమల యాజమాన్యంలో ఎలాంటి మార్పు రాలేదు. కాలుష్యంను వదిలితే పరిశ్రమపై పెట్రోల్ పోసి నిప్పంటిస్తానని ఎమ్మెల్యే హెచ్చరించినా, ఫార్మ పరిశ్రమల యాజమాన్యంలో ఎలాంటి మార్పు రాలేదంటూ బాధిత రైతులు వాపోతున్నారు. తాజాగా అరబిందో ఫార్మ పరిశ్రమ నుంచి ఓ వైపు వాయు, మరో వైపు నీటి కాలుష్యంను వెద జల్లుతున్న ఫొటోలు, వీడియోలను బాధిత రైతులు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డికి సామాజిక మాధ్యమంలో పంపించి, కాలుష్యం బారినుంచి రక్షించాలంటూ వేడుకున్నారు. ఆదివారం ఉదయం 11గంటల వరకు అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో ఫార్మ పరిశ్రమను తగులబెడ్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అల్టిమేటం జారీ చేశారు.

వైద్య కళాశాలకు శరీరదానం



మెడికల్ కళాశాలకు శరీరదానం చేస్తున్న పుట్ట అంజనేయులు కుటుంబ సభ్యులు, చిత్రంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

వనపర్తి వైద్యవిభాగం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి వైద్య కళాశాలకు సీపీఎం నాయకులు శరీరదానం చేశారు. జిల్లా కేంద్రానికి చెందిన సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట అంజనేయులు భార్య వరలక్ష్మి(50) గురువారం రాత్రి మృతి చెందింది. వరలక్ష్మి మృతదేహాన్ని శుక్రవారం వనపర్తి మెడికల్ కళాశాలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో పుట్ట అంజనేయులు కుటుంబ సభ్యులు దానం చేశారు. మరణించిన అనంతరం చేయాల్సిన సంప్రదాయబద్ధమైన కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం మెడికల్ కళాశాలకు శరీరదానం చేయగా.. కుటుంబ సభ్యులకు కళాశాల సిబ్బంది ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, డాక్టర్ మురళీధర్, గంధం నాగరాజు, సీపీఎం నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

పట్టణ రూపురేఖలు మారుతాయి

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



సీతరాల గుట్ట పరిసర ప్రాంతంలో బతుకమ్మ పండగ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట పట్టణాభివృద్ధికి రూ. 30 వివిధ పనులు ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, త్వరలో అచ్చంపేట రూపురేఖలు మారబోతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మునిసిపల్ కమిషనర్ మురళితో కలిసి పట్టణంలోని సీతరాల గుట్ట దగ్గర బతుకమ్మ ఉత్సవాల కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి సహకారంతో అచ్చంపేట పట్టణంలోని సీతరాల గుట్ట సమీపంలో ఏడు ఎకరాలలో వైఎస్ఆర్ పార్కు ఏర్పాటుతో పాటు రూ. 8కోట్లతో రాజీవ్ ఎన్టీఆర్ మినీ స్టేడియం విస్తరణ పనులు, కళాభారతి వంటి అభివృద్ధి పనులకు త్వరలో శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. పెద్ద ఎత్తున పట్టణంలో బతుకమ్మ వేడుకలు జరుపుకునేందుకు అన్ని విధాలా సిద్ధం చేస్తున్నామని, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చత్రు నాయక్, కాశన్న యాదవ్, లక్ష్మణ్, రాంబాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో శ్రద్ధతో పని చేయాలి

- అదనపు డీఆర్‌డీఓ ముసాహిదా బేగం



గండీడ్ సామాజిక తనిఖీలో వివరాలను అడిగి తెలుసుకుంటున్న అధికారులు

గండీడ్/ మహమ్మదాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో జరిగే పనులపై టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు శ్రద్ధ పెడితే తప్పిదాలకు ఆస్కారం ఉండదని అదనపు డీఆర్‌డీవో ముసాహిదా బేగం, అంబుడ్స్‌పర్సన్ సంతోష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.6.49కోట్లకు గాను 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. గండీడ్, మహమ్మదాబాద్ మండలాల 49 పంచాయతీలకు 18 పంచాయతీలకు తనిఖీలో వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఒకరికి బదులుగా మరొకరు పనులు చేసినట్లు, రికార్డుల నిర్వహణ సరిగా లేదని, నర్సరీలలో సగానికిపైగా మొక్కలు ఎండిపోయాయని, మస్టర్లలో పలు తప్పిదాలు చేసినట్లు తనిఖీ బృందం అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తనిఖీ శనివారం సాయంత్రం వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీవీఓ ప్రేమలత, ఎస్ఆర్ పీ రామవులు, ఎంపీడీవోలు హరిచందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఏపీవో హరిశ్చంద్రుడు, పీఆర్ఏఈలు ముతీన్, హలీం తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో యూరియా కొరత తీర్చాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో యూరియా కొరత అధికంగా ఉందని, సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని టీపీ సీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి చాంబర్‌లో కలిసిన వినతిపత్రం అందజేశారు. ఈసారి ఎన్నడూలేని విధంగా జూలై, ఆగస్టు మాసాలలోనే భారీ వర్షాలు కురిసినందున వ్యవసాయం ఊపందుకుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 2.50 లక్షల ఎకరాల్లో వరి, మొక్కజొన్న వేశారని గుర్తుచేశారు.

ఉత్సాహంగా బతుకమ్మ సంబురాలు

» మహబూబ్‌నగర్‌లో ఆడిపాడిన ఉద్యోగులు, అధికారులు, విద్యార్థులు



బతుకమ్మను ఎత్తుకున్న కలెక్టర్ విజయేందిరబోయి



పాలమూరు యూనివర్సిటీలో బతుకమ్మలకు పూజలు చేస్తున్న వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పూస రమేశ్ బాబు, అధికారులు



మహబూబ్‌నగర్‌లోని జర్నలిస్టు కాలనీలో బతుకమ్మ వేడుకలకు హాజరైన మహిళలు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ / పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్, పాలమూరు యూనివర్సిటీలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. కలెక్టర్ విజయేందిరబోయి పూజలు చేసి వేడుకలు ప్రారంభించారు. మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ, కోలాటం ఆడారు. పాలమూరు యూనివర్సిటీలోని లైబ్రరీ ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు సాయంత్రం తరగతులు పూర్తికాగానే బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. వీసీ జీ ఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పూస రమేశ్ బాబు, అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రైం కార్నర్

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు


నిందితులతో డీఎస్పీ లింగయ్య, పోలీసు సిబ్బంది

మక్తల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ఎన్.లింగయ్య తెలిపారు. శుక్రవారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాత్రి వేళల్లో ముగ్గురు వ్యక్తులు దొంగతనం చేసి ఇతర రాష్ట్రాల్లో తక్కువ ధరకు విక్రయించి వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారన్నారు. శుక్రవారం సీఐ రాంలాల్, ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డిలు దర్యాప్తు ప్రారంభించారు. పట్టణ శివారులో అనుమానాస్పదంగా బైక్ దొంగిలిస్తున్న వ్యక్తులు కోరం ఎల్లప్ప(ఖైరతాబాద్), స్వర్ణ దుర్గప్ప అలియాస్ దుర్గేష్(హైదరాబాద్), శంశొద్దీన్(బసవేశ్వరనగర్, షోలాపూర్ బైక్ మెకానిక్)లు మక్తల్, యాదగిరి, కర్నాటక ప్రాంతాల్లో బైక్‌లను చోరీ చేసి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. మక్తల్, మరికల్, క్రిష్ణ, హైదరాబాద్‌లో పలు బైక్‌లు దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు.

వారి నుంచి 5షైన్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.4లక్షలు ఉంటుందన్నారు. నిందితునలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సీఐ రాంలాల్, ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి, నవీద్, ఏఎస్సై శంకరయ్య, కానిస్టేబుల్ అశోక్, శ్రీకాంత్, శశిధర్, బరత్‌లను అభినందించారు. త్వరలో రివార్డు ఇస్తామన్నారు.

కారు, కంటైనర్ ఢీ..

బాలానగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ ప్రధాన రహదారిపై కంటైనర్, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జయింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి గ్రామానికి చెందిన బీసన్న అతని స్నేహితుడైన బి.శివకుమార్ కారులో తన చిన్నమ్మ మహేశ్వరి, చిన్నాన అరుణ్‌కుమార్‌తో కలిసి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఫ్లైఓవర్ పనులు నడుస్తున్నాయి. దీంతో సర్వీస్ రోడ్డు ఇరుకుగా ఉండటం వలన ప్రమాదవశాత్తు కారును కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. కారు నుజ్జునుజ్జయింది. బీసన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

పెబ్బేరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెబ్బేరు మండలంలోని పాతపల్లి గ్రామం దగ్గర శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని జల్లాపూర్ గ్రామానికి చెందిన ఖాజా ఉసేన్ తన బైక్‌పై బంధువుల ఊరు చిన్నంబావికి వెళుతున్నాడు. పాతపల్లి గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. క్షతగాత్రునికి వైద్య సిబ్బంది చికిత్స అందించారు.

తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట,(ఆంధ్రజ్యోతి): తిమ్మాజిపేట మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్‌బంక్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బిజినేపల్లికి చెందిన మున్నవరొద్దీన్(24) అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ఏఎస్ఐ నిర్మలాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. బిజినేపల్లి గ్రామం నుంచి ప్రవీణ్ అనే మిత్రునితో కలిసి మున్నవరొద్దీన్ బైకుపై జడ్చర్లలో జరిగే పెళ్లికి వెళ్తున్నాడు. ఇప్పలపల్లి రోడ్డు వైపు నుంచి ప్రధాన రహదారి పైకి వేగంగా వచ్చిన మరో బైక్ ఢీ కొన్నది. దీంతో మున్నవరోద్దీన్‌కు గాయాలయ్యాయని, ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకున్న తండ్రి మజాహరొద్దీన్ సంఘటన స్థలానికి చేరుకుని తన కుమారున్ని హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం బాధితుని పెద్దనాన్న కుమారుడు అంజద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

కుక్కను తప్పించబోయి...

గండీడ్,(ఆంధ్రజ్యోతి): బైక్ పైనుంచి కిందపడి ఇద్దరికీ గాయాలైన ఘటన పెద్దవార్వాల్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవార్వాల్ గ్రామానికి చెందిన మల్లేష్‌తో పాటు తండ్రి ఆశన్న ఇద్దరూ కలిసి పని నిమిత్తం వెళ్లి తిరిగి వస్తున్నారు. పెద్దవార్వాల్ సమీపంలోని రాయికుంట చెరువు కట్టపై కుక్క అడ్డం రావడంతో దాన్ని తప్పించబోయి బైక్ నుంచి కింద పడటంతో వారికి గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

మక్తల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని శబరి కాలనీలో చోటు చేసుకుంది. ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి కథనం మేరకు... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా బొబ్బిలి మండలంలోని షిరిడి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌నాయుడు పదేళ్ల కిందట బతుకు దెరువుకోసం వచ్చాడు. కర్ణాటకలోని శిల్ప పార్మ కంపెనీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 25న ఉదయం డ్యూటీకి వెళ్లి ఎప్పటిలాగే సాయంత్రం ఇంటికి వచ్చాడు. భార్య విజయలక్ష్మి పిల్లలతో గుడికి వెళ్లగా రాత్రి 9.15 గంటలకు ఇంటి గడియ వేసుకొని ఉరి వేసుకున్నాడు. భార్య ఇంటికి వచ్చి చూడగా అప్పటికే ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఉన్నాడు. తలుపులు తెరిచి చూడగా అప్పటికే మృతి చెందినట్లు ఆయన సోదరుడు నవీన్ తెలిపారు. భార్యాభర్తలు తరచూ గొడవ పడటంతో మనస్తాపం చెంది క్షణికావేశంతో ఉరి వేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

మాగనూరు(కృష్ణ), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మాగనూరు మండలం అమ్మపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం కరెంటు షాక్‌తో కురువ సాబెన్నకు సంబంధించిన ఆరు గొర్రెలు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థుల వివరాల ప్రకారం... గ్రామంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ ఉండడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర గొర్రెలు మేతకు వెళ్లి కరెంటు షాక్‌తో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి మృతి చెందిన గొర్రెలకు నష్టపరిహారం చెల్లించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు కంచ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



ఉత్తమ అవార్డును అందుకుంటున్న ఉపాధ్యాయుడు బరిగెల జైపాల్

తెలకపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలకపల్లి మండల పరిధిలోని వట్టిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న బరిగెల జైపాల్ కు శుక్రవారం శారద ఎడ్యుకేషనల్ సొసైటీ వారు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందించారు. ఈ మేరకు హైదరాబాదు బిర్లా ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఇటికాల పురుషోత్తం చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు జైపాల్ తెలిపారు.

ఈ పురస్కారం విద్యారంగంలో విశిష్ట సేవ, అత్యున్నత పద్ధతులు, పాఠశాల అభివృద్ధి విద్యార్థులలో సృజనాత్మకత విలువలు, విద్యార్థులకు గుణాత్మక విద్య కొరకు చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డు ఇచ్చినట్లు తెలిపారు.

వణికిస్తున్న వానర సేన


కోతులను జాలిలో బంధించిన గ్రామస్థులు

- పంట చేలను ధ్వంసం చేస్తున్న పరిస్థితి
- గ్రామాల్లో జనాలను రక్కేస్తున్నాయ్..
- ఇళ్లలోకి దూరి భయభ్రాంతులకు గురి చేస్తున్న వైనం
- తీవ్ర సమస్యగా మారిన కోతుల బెడద
- రక్షణ చర్యలకు పాట్లు పడుతున్న రైతులు, ప్రజలు


ఇళ్లలోకి దూరి రక్కేస్తున్నాయి

కోతులు ఇళ్లలోకి వచ్చి తినేటివి మొత్తం పారబోసి తీసుకెళుతున్నాయి. ఒక్కరిద్దరు ఉంటే వాళ్లమీద పడి రక్కేస్తున్నాయి. కోతులను చూస్తునే భయపడాల్సి వస్తున్నది.

- సుజాత, గృహిణి పెనిమిళ్ల


● **రోజు రోజుకు కోతుల బెడద ఎక్కువైంది**

పంట పొలాల్లో పంటలు వేయాలంటే కోతులతో ఇబ్బందిగా మారింది. కూరగాయలు, పండ్ల తోటలు పెట్టలేకపోతున్నాం. కోతుల బెడద తగ్గే పరిస్థితి లేక ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నాం.

- సింగం వెంకటయ్య, లింగాల

అచ్చంపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పల్లె, పట్టణం అనే తేడా లేకుండా వానరాలు ఇళ్లలోకి దూరి చేతికందిన కాడికెల్లా తినేయడమే కాకుండా భయాందోళన సృష్టిస్తున్నాయి. ఎవరు ఏమన్నా మీదపడి రక్కేస్తున్నాయి. అచ్చంపేట ఏరియా ఆసుపత్రిలో ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు వరకు కోతుల బారిన పడి గాయపడిన వారు 74 మంది ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో పాటు చేతికొచ్చిన పంట పొలాలపై కోతులు పడి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. కోతులకు పంట పొలాల్లో ఉండే చెట్లు ఆవాసాలుగా మారడంతో రైతులు వాటిని తొలగిస్తున్నారు. చెట్ల పొదలలో చేరి చేతికొచ్చిన పంటలను సర్వనాశనం చేస్తున్నాయి. గ్రామాల్లో, పట్టణాల్లో ఇళ్లలోకి దూరి తినుబండారాలను ఎత్తుకెళ్తున్నాయి. ఏమైనా అంటే రక్కేయడంతో పాటు మీదపడి కరిచేస్తున్నాయి. రోజురోజుకు కోతుల బెడద అధికమవుతుందే.. తప్పా సమస్య పరిష్కారం కావడం లేదు.

పంటలు సాగు చేసేందుకు రైతుల వెనుకడుగు

కోతుల బెడదతో రైతులు కూరగాయలు, తదితర పంటల సాగు చేయాలంటేనే వెనుకడుగు వేస్తున్నారు. చేతికి వచ్చిన పంటలపై వానరాలు చేరి తినేయడమే కాకుండా ధ్వంసం చేస్తున్నాయి. ఈ క్రమంలో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రాలేని పరిస్థితి నెలకొంటుంది. ఈ క్రమంలో ఎలాగైనా కోతుల బెడద నుంచి పంటలను రక్షించుకోవాలని, పంటల చుట్టూ సోలార్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కొందరు రైతులు వలలను రక్షణగా ఏర్పాటు చేసుకుంటున్నారు. మరికొందరు రైతులు అనునిత్యం పంట పొలాల వద్ద కాపలా కాస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో కోతులు ఇళ్లలోకి దూరకుండా ఇంటి చుట్టూరా సోలార్ రక్షణ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రత్యేక బోన్లను ఏర్పాటు చేసి కోతులను బంధించి అడవులలో వదులుతున్నారు. గ్రామాల్లో ఉన్న వ్యాపారులు కోతుల నుంచి రక్షణ పొందేందుకు దుకాణాలకు జాలీలు ఏర్పాటు చేసుకుంటున్నారు.


కోతుల నుంచి పంటకు రక్షణ కోసం ఏర్పాటు చేసిన కంచె

భారీ వర్షం

- పారుతున్న వాగులు, చెరువుల అలుగులు
- గద్వాల జిల్లా మల్దకల్‌లో 98.2 మిల్లీ మీటర్ల వర్షం


పేట మండలంలో పొంగి పొర్లుతున్న సింగారం వాగు

మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల/ వనపర్తి/ నారాయణపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున మొదలైన వర్షం మధ్యాహ్నం వరకు ఎడతెరిపిలేకుండా కురిసింది. ఆగకుండా పది గంటలపాటు కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని వాగులు పొంగిపొర్లాయి. కుంటలు, చెరువులు అలుగులు పారుతున్నాయి.

జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్‌లో 98.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. గద్వాలలో 93.5, అయిజలో 93.1, ధరూర్‌లో 89.9, ఇటిక్యాలలో 80, కేటీదొడిలో 71, వడ్డేపల్లిలో 60, గట్టులో 56.9, రాజోలిలో 56.1, ఆలంపూర్‌లో 51.4, మానవపాడులో 44.7, ఎర్రవల్లిలో 41.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. నారాయణ పేట జిల్లా నర్వ మండలంలో 60 మి.మీ. వర్షపాతం నమోదైంది. మరికల్‌లో 42.5, మరికల్‌లో 42.5, మాగనూర్‌లో 24.5, కృష్ణలో 24.0, ఊట్కూర్‌లో 23.5, కోస్గిలో 22.8, కొత్తపల్లిలో 22.3, మక్తల్‌లో 18.0, దామరగిద్దలో 17.5, గుండుమాల్‌లో 17.3, నారాయణపేటలో 15.5, ధన్వాడ మండలంలో 17.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడలో 58.4 మి.మీ. మహ్మదాబాద్‌లో 53.4, భూత్పూర్‌లో 43.1, కౌకుంట్లలో 42.5, జడ్చర్లలో 41.1, మూసాపేటలో 40.9, బాలానగర్‌లో 40.5, రాజాపూర్‌లో 39.3, గండీడ్‌లో 36.7, నవాబ్‌పేటలో 33.8, సీసీకుంటలో 32.8, మిడ్జిల్‌లో 32.7, మహబూబ్‌నగర్ అర్బన్‌లో 34.1, దేవరకద్రలో 35.మి.మీ. వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో 45.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అమ్రాబాదు మండలంలో 41.4, పదరలో 40.6, వెల్దండలో 38.6, ఉప్పునుంతలలో 34.6, వంగూరులో 34.2, కొల్లాపూర్‌లో 34.2, కోడేరులో 33.4, బిజినేపల్లిలో 32.6, పెంట్లవెల్లిలో 31.4, తాడూరులో 31.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మిగతా మండలాల్లో 20.8 మిల్లీ మీటర్ల నుంచి 30.8 మిల్లీ మీటర్ల మధ్య వర్షపాతం నమోదైంది. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలో 42.3 మి.మీ వర్షపాతం నమోదైంది.

జోగుళాంబను దర్శించుకున్న ప్రముఖులు


పూజలు చేస్తున్న సరిత

అలంపూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబదేవి అమ్మవారిని దేవీ శరన్నవరాత్రులలో భాగంగా శుక్రవారం పలువురు దర్శించుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, సినీ నిర్మాత బండ్ల గణేష్‌లు కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు వారికి ఆలయ ఈఓ దీప్తి, ధర్మకర్తలు అడ్డాకుల రాము, నాగశిరమణి, పురందర్, చంద్రశేఖర్ రెడ్డి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి వారి ఆలయంలో గణపతిపూజ, అభిషేకం, చండీ హోమం, అమ్మవారి ఆలయలో కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. వీరి వెంట డీఎస్పీ మొగులయ్య, సీఐ రవిబాబు, ఎస్సైలు వెంకటస్వామి, నిమ్మల కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


అలంపూరులో పూజలు చేస్తున్న సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక


సాయిపూజ, శృతి

పాన్‌గల్/శ్రీరంగాపురం/జడ్చర్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న సాయిపూజ, శృతి కబడ్డీ జూనియర్స్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పీడీ శ్యామల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కబడ్డీ జూనియర్ విభాగంలో ఈనెల 14వ తేదీన వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల లో పాల్గొని ఎంపికయ్యారని అన్నారు. అలాగే ఎంపికైన విద్యార్థినులను 18 నుంచి 21 వరకు ప్రత్యేక క్యాంపును నిర్వహించి అక్కడ రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారని ఆమె పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినులు ఈ నెల 27, 28వ తేదీలలో నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ విభాగం కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు ఆమె పేర్కొన్నారు.

● వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన ఆంజనేయులు కూతురు శ్రీవాణి నిజామాబాద్‌లో జరుగుతున్న సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైంది. అదే విధంగా మొదటి మ్యాచ్ మహబూబాబాద్ వనపర్తి 32 పాయింట్లతో గెలుపొందింది. ఈ సందర్భంగా శ్రీరంగాపురం మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

● రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు జడ్చర్ల పట్టణంలోని మహాత్మా జ్యోతి రావుపూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినీ హేమావతి ఎంపికయ్యిందని ప్రిన్సిపాల్ శ్యామల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న జిల్లా కేంద్రంలోని ఇండోర్‌స్టేడియంలో నిర్వహించిన సబ్ జూనియర్ కబడ్డీ సెలక్షన్స్‌లలో ఎంపిక చేశారని తెలిపారు.

ఈ నెల 26 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌లో జరిగే సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటుందని పేర్కొన్నారు.

పేట జిల్లాకు మహర్దశ

- తెలంగాణ నుంచి వ్యవసాయ రంగంలో ఎంపిక
- దేశంలో వెనుకబడిన వంద జిల్లాల్లో నారాయణపేట ఒకటి
- ఆరేళ్లపాటు జిల్లా రైతాంగానికి అందనున్న కేంద్ర వ్యవసాయ పథకాలు


సింగారంలో పత్తి చేనుకు దంతె కొడుతున్న రైతు(ఫైల్)

నారాయణ పేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే వెనుకబడిని జిల్లాగా నారాయణపేట ఎంపికైంది. ఇటీవల దేశంలోనే వెనుకబడిన ప్రాంతాలుగా 100 జిల్లాల పేర్లతో కేంద్రం విడుదల జేసిన జాబితాలో పేటకు చోటు దక్కింది. ఈ పథకం కింద ఏడాదికి 24, 000 కోట్ల బడ్జెట్‌తో దేశవ్యాప్తంగా 100 జిల్లాలను లక్ష్యంగా చేసుకుని ఈ పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. రాబోయే ఆరేళ్లలో జిల్లాలో వ్యవసాయ అవసరాలకు, పనిముట్లు, యాంత్రాలు, మిషనరీ తదితర రైతాంగ అవసరాలకు కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు అందనున్నాయి.

పీఎం ధన్-ధన్య కృషి యోజన...

ప్రధాన మంత్రి ధన్-ధన్య కృషి యోజన పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్‌లో 2025 జూలై 16న ఆమోదించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను వ్యవసాయ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం కోసం కేంద్రం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. నీటిపారుదల సౌకర్యాలను మెరుగుపరిచి దీర్ఘ, స్వల్ప కాలిక పంట రుణాలను సులభతరం చేసి రైతులకు అందించి వ్యవసాయ రంగాన్ని మరింతగా ప్రోత్సహించేలా చర్యలు తీసుకోనున్నారు. నీటిపారుదల సౌకర్యాలు మెరుగుపరిచి పంటలు అధికంగా పండేలా చర్యలు తీసుకుంటారు. పంట కోతల తర్వాత నిల్వలు చేసుకునేలా గోదాంలు నిర్మించి.. అందులో ఉంచి, అనంతరం మార్కెట్‌లో లాభదాయక ధర వచ్చిన తర్వాత రైతులు విక్రయించుకునేలా సౌకర్యాలు కల్పించనున్నారు.

ప్రధాని మోదీకి ఎంపీ డీకే అరుణ కృతజ్ఞతలు

కేంద్రం విడుదల చేసిన వెనుకబడిన జిల్లాల జాబితాలో నారాయణపేటను ఎంపిక చేయడంతో జిల్లా ప్రజల తరుపున ప్రధాని నరేంద్రమోదీకి ఎంపీ డీకే అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఎంపీ కృషితోనే నారాయణపేట జిల్లా ఎంపికైందని, ఈ పథకంతో జిల్లా రైతాంగం వ్యవసాయ పరంగా ఆరేళ్లపాటు అందే కేంద్ర పథకాలతో ఎంతో మేలు చేకూరుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ పేర్కొన్నారు.

జిల్లాలో సాగుభూమి విస్తీర్ణం 4.54 లక్షల ఎకరాలు

జిల్లా జనాభా 5,66,874 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ సాగు భూమి విస్తీర్ణం 4.54 లక్షల ఎకరాలు ఉంది. రెండు ఎకరాలలోపు చిన్న సన్నకారు రైతులు 97,780 మంది, ఐదెకరాలుపైగా ఉన్న రైతులు 80,237 మంది ఉన్నారు. జిల్లాలో ముఖ్యంగా వరి పంట, కంది, పత్తి పంటను సాగు చేస్తారు. అలాగే వేరుశనగ, పెసర, ఆముదం తదితర పంటలు పండిస్తారు. రెండు వేల ఎకరాలలో కూరగాయలు పండిస్తారు.

సరళాసాగర్ సైఫన్స్ ఓపెన్

- ఆత్మకూర్, వనపర్తికి నిలిచిన రాకపోకలు


మదనాపురం మండలంలో లోలెవెల్ వంతెనపై ప్రవహిస్తున్న నీరు

మదనాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ నుంచి భారీ వరద రావడంతో సరళాసాగర్ ప్రాజెక్టు ఆటోమెటిక్ సైఫన్స్ శుక్రవారం రెండు ఓపెన్ చేశారు. వీటి ద్వారా 9వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మండలంలోని ఊకచెట్టు వాగుపై ఉన్న లోలెవల్ వంతెనపై నీరు ప్రవహిస్తుండడంతో ఆత్మకూర్, వనపర్తిలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీనితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రామన్‌పాడు ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తి 14 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

సంగంబండ రిజర్వాయర్ 2 గేట్లు ఎత్తి నీటి విడుదల


గేట్లు తెరవడంతో దిగువకు వెళ్తున్న నీరు


మక్తల్‌రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మక్తల్ మండలంలోని నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి పెద్ద వాగుకు వరద నీటి ఉధృతి పెరగడంతో శుక్రవారం 2 గేట్లతో దిగువకు నీటి విడుదల చేశారు. జలాశయంలోకి 1000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 1000 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉందని, రిజర్వాయర్ నీటి పూర్తి సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.63 టీఎంసీలు ఉందని ఇరిగేషన్ డీఈఈ సురేష్ తెలిపారు.

కోయిల్‌సాగర్‌కు జలకళ


నిండుకుండగా కోయిల్‌సాగర్ ప్రాజెక్టు

దేవరకద్ర, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌కు జలకళ సంతరించుకుంది. గురువారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరద ఉధృతి బాగా పెరిగింది. దీంతో ప్రాజెక్టు 3 షెట్టర్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 32. 5 అడుగులు కాగా, శుక్రవారం నాటికి నీటిమట్టం 32.4 అడుగులకు చేరింది. కురుస్తున్న వర్షాలు కురవడంతో అంకిళ్ల, కోయిల్‌కొండ పెద్దవాగుల నుంచి ప్రాజెక్టుకు నీటి ఉధృతి పెరగడంతో ప్రాజెక్టు అధికారులు 3 షెట్టర్ల నుంచి దిగువకు 2100 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు.

ఎత్తిన శ్రీరంగ సముద్రం రిజర్వాయర్ గేటు


శ్రీరంగ సముద్రం గేటు నుంచి విడుదల అవుతున్న నీరు

శ్రీరంగాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గురువారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షాలకు శ్రీరంగ సముద్రం రిజర్వాయర్ రెండు గేట్లు ఎత్తి కిందికి నీటిని వదిలారు. ఈ సందర్భంగా ఎస్ఐ హిమబిందు మాట్లాడుతూ రిజర్వాయర్ కింద ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదే విధంగా భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

వర్షంతో ఫుట్‌బాల్ టోర్నీకి అడ్డంకి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీ వర్షం కారణంగా రెండో రోజు శుక్రవారం మ్యాచ్‌లు రద్దు అయ్యాయి. ఈ నెల 28 వరకు పోటీలు జరుగుతాయి. శనివారం వర్షం తగ్గితే మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉందని టోర్నీ నిర్వాహకులు తెలిపారు. టోర్నీలో 12 జిల్లాలు తలబడుతున్నాయి.

ఇంటర్వ్యూ..

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- జి.మాధవరెడ్డి, ఎస్ఐ, కల్వకుర్తి



కల్వకుర్తి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే జైలు శిక్షతోపాటు జరిమానా తప్పదని ఆయన ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై చర్యలు తప్పవు. వాహన చోదకులు కచ్చితంగా వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్సు, హెల్మెట్ కలిగి ఉండాలి.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇప్పటి వరకు ఎంత మంది పట్టుబడ్డారు. జైలు శిక్ష ఎంత మందికి పడింది?

ప్రతీ రోజు డ్రంకెన్ డ్రైవ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 811 మంది డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. పట్టుబడిన వారిని కోర్టులో హాజరు పరిస్తే 53మందికి జైలు శిక్షతోపాటు జరిమానా, మిగతా 758మందికి న్యాయమూర్తి జరిమానా విధించారు.

● సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా?

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం. దొంగతనాలు, హత్యలు జరిగినప్పుడు సాక్ష్యానికి సీసీ కెమెరాలు దోహదపడుతాయి. గ్రామాలతో పాటు పట్టణంలోని కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

న్యూస్ బాక్స్

పోలీసు స్టేషన్ తనిఖీ



పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ బుర్రి శ్రీనివాస్‌యాదవ్

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను నాగర్‌కర్నూల్ డీఎస్పీ బుర్రి శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను ఆయన కలియదిరిగారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో క్రైం రేటును, అన్ని రకాల రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన వెంట కొల్లాపూర్ సీఐ మహేష్, స్థానిక ఎస్ఐ సతీష్ ఉన్నారు.

తెలంగాణ సాహితీ జిల్లా కమిటీ ఎన్నిక

నాగర్‌కర్నూల్‌టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాహితీ జిల్లా నూతన కార్యవర్గం ఏర్పడింది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్షుడు వల్లభాపురం జనార్దన్ అధ్యక్షతన జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ వి.భానుచందర్, ఉపాధ్యక్షులుగా ఎ.వెంకటేశ్వర్లు, అంగోత్ మోతిరాంపవార్, జానకమ్మ, ప్రధాన కార్యదర్శిగా పి.అబ్దుల్ వహీద్‌ఖాన్, కోశాధికారిగా బనవోజు లక్ష్మణచారి, కార్యవర్గ సభ్యులుగా అల్వాల లక్ష్మణమూర్తి, కర్నాటి రఘురాములుగౌడ్, గౌస్‌పాషా, పెరుమాళ్ల రాము, ప్రచార కార్యదర్శులుగా కోట్ల గౌతం, రాసమొళ్ల మల్లికార్జున్, కె.దశరథం, జిల్లా కమిటీ సభ్యులుగా సేవ్య, కృష్ణయ్యగౌడ్, బలరాం, బోనాసి తిరుపతయ్య, విజయ్‌కాంత్‌ను ఎన్నుకున్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోట్ల వెంకటరమణకు సన్మానం

కల్వకుర్తి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి సబ్ కోర్టు పీపీగా నియమితులైన కే.వెంకటరమణను ముదిరాజ్ సేవకుల సంఘం నాయకులు సన్మానించారు. పట్టణంలోని కేవీ.రమణ అడ్వకేట్ నివాసంలో శుక్రవారం ముదిరాజ్ సేవకుల సంఘం నాయకులు ఆయనను కలిసి పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. కల్వకుర్తి కోర్టులో సీనియర్ న్యాయవాదిగా నోటరీగా విధులు నిర్వహించిన కేవీ.రమణ పీపీగా ఎంపిక కావడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. సన్మానించిన వారిలో ముదిరాజ్ సేవకుల సంఘం సభ్యులు రాజు, రామకృష్ణ, సుధాకర్, విజయభాస్కర్, శ్రీను, సురేష్, శివప్రసాద్, రమేష్, గణేష్, సాయి, రంగ, జనార్దన్ పాల్గొన్నారు.

నేడు ఏటీసీ కేంద్రం ప్రారంభం

మన్ననూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో టాటా టెక్నాలజీ సౌజన్యంతో నిర్మించిన ఆధునిక సాంకేతిక కేంద్రం (ఏటీసీ) భవనాన్ని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభిస్తారని మన్ననూరు ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ లక్ష్మణస్వామి తెలిపారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి : కల్వకుర్తి పట్టణంలోని ఐటీఐ కళాశాలలో రూ.40కోట్లతో నిర్మించిన అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌ను శనివారం ఉదయం 11గంటలకు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభిస్తారని కళాశాల ప్రిన్సిపాల్ కే.జయమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, నాయకులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ కే.జయమ్మ కోరారు.

మహాలక్ష్మీదేవి పాహిమాం



కందనూలు : శ్రీమహాలక్ష్మీదేవి అవతారంలో దుర్గామాత



అచ్చంపేట : ఉమామహేశ్వర క్షేత్రంలో స్కందమాతగా...



కొల్లాపూర్‌లో ధనలక్ష్మీదేవి అలంకరణలో...

కందనూలు/ అచ్చంపేట/ టౌన్/ కల్వకుర్తి/ కొల్లాపూర్/ బిజినేపల్లి/ తాడూరు/ వెల్దండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. దుర్గామాతను రోజుకో రూపంలో అలంకరించి, పూజలు చేస్తున్నారు. శుక్రవారం మహాలక్ష్మీ రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. నాగర్‌కర్నూల్లోని కన్యకాపరమేశ్వరి ఆలయం, రాఘవేంద్ర కాలనీరోడ్డు నెంబరు-1, 2లో మహాలక్ష్మీ దేవిగా, అచ్చంపేట మండలం రంగాపూర్ సమీపంలోని ఉమామహేశ్వర క్షేత్రంలో స్కందమాత దేవిగా, అచ్చంపేట పట్టణంలోని భ్రమరాంబికా దేవి ఆలయంలో శ్రీమహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ దంపతులు అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. కల్వకుర్తి పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ జూలూరి రమేష్ బాబు ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉత్సవాల్లో ధనలక్ష్మీ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కొల్లాపూర్ పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని రూ. కోటీ 40లక్షలతో అలంకరించారు. అదేవిధంగా పట్టణంలోని వరిదేల శమీవృక్ష అభివృద్ధి కమిటీ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన అమ్మ వారి మండపంలో రూ. 54 లక్షలతో అలంకరించారు. పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో ఏర్పాటు చేసిన అమ్మవారిని రూ.5వేలతో అలంకరించారు. బిజినేపల్లి, తాడూరు, వెల్దండ మండలాల్లో మహాలక్ష్మీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



భ్రమరాంబికా ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



పాలెం వెంకన్న ఆలయంలో మహాలక్ష్మీదేవిగా దుర్గామాత

జమీందారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన
యోధురాలు

- ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ జయంతి

- ఘన నివాళి అర్పించిన కలెక్టర్, ఎస్పీ



కలెక్టరేట్‌లో ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, అధికారులు, సిబ్బంది

నాగర్‌కర్నూల్/ కందనూలు/ అచ్చంపేట టౌన్/ కొల్లాపూర్/ కల్వకుర్తి/ ఉప్పునుంతల/ బిజినేపల్లి/ తిమ్మాజిపేట/ చారకొండ/ వెల్దండ/ పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించారు. అధికారికంగా కలెక్టర్, ఎస్పీ, ఇతర కార్యాలయాల్లో అధికారులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఇక రజక, ప్రజా, దళిత, కుల సంఘాల ఆధ్వర్యంలో నాయకులు చాకలి ఐలమ్మ విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసిన ఘన నివాళి అర్పించారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ బదావత్ సంతోష్ జ్యోతి ప్రజ్వలన చేసి ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లా డుతూ తెలంగాణ రైతాంగ సాయుధ ఉద్యమంలో వీరనారి చాకలి ఐలమ్మ ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. జమీందారి వ్యవస్థకు వ్యతిరేకంగా నిలబడి పేదరైతుల కోసం పోరాడి న ఆమె నిజమైన ప్రజా యోధురాలని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.అమరేందర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఇన్‌చార్జి జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి యాదగిరి, డీఈవో రమేష్ కుమార్, డీవైఎస్‌వో సీతారాం నాయక్, మిషన్ భగీరథ ఈఈ సుధాకర్‌సింగ్, జిల్లా అధికారులు, వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది, కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏవో కృష్ణయ్య, సీఐ శంకర్, ఆర్ఐ జగన్, సీసీ బాలరాజు, ఆర్ఎస్ఐ గౌస్‌పాషా, ఎస్బీఐ రమేష్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ● అచ్చంపేటలో బీసీ సంఘం జిల్లా నాయకులు కాశన్న యాదవ్, ఐఎన్‌టీయూసీ నాయకులు మహబూబ్‌అలీ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ● కొల్లాపూర్‌లో పీజీ సెంటర్ (పీయూ అనుబంధం)లో చాకలి ఐలమ్మ పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ మార్కపోలోనియస్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, సిబ్బంది ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. కొల్లాపూర్ పట్టణంలో ఆర్డీవో కార్యాలయం చౌరస్తాలో రజకసంఘం పట్టణ అధ్యక్షుడు తిప్ప రాజుల సన్నీ జిల్లా నాయకులు నరసింహ, కేతూరి ధర్మతేజ, శేఖర్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ● కల్వకుర్తిలో నియోజకవర్గంలోని అపురాసిపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని పలువురు ప్రముఖులతో కలిసి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఐలమ్మ స్ఫూర్తితో రాష్ట్రంలో పాలన కొనసాగుతోందని ఆయన తెలిపారు. కల్వకుర్తి పట్టణంలో చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.

తల్లిదండ్రుల సహకారంతోనే
విద్యార్థి సమగ్ర విద్యాభివృద్ధి

- ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ



పేరెంట్స్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ

తాడూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల విద్య, మానసిక, శారీరక అభివృద్ధి తల్లిదండ్రులు, అధ్యాపకుల సహకారంతోనే జరుగుతుందని ఇంటర్మీడియట్ విద్యా జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ అన్నారు. తల్లిదండ్రులతో అనేక విషయాలు చర్చించి తగిన నిర్ణయాలు తీసుకుని విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేస్తామని చెప్పారు. తాడూరు లోని కూచకుళ్ల సౌభాగ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ శనివారం క్రీడలు నిర్వహిస్తున్నామని, మౌలిక వసతుల కల్పనకు బోర్డు ద్వారా నిధులు కేటాయించామన్నారు. అనంతరం విద్యార్థుల ప్రగతి పత్రాలను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో పీవో మురళీకృష్ణ, స్టూడెంట్ కౌన్సిలర్ డాక్టర్ నర్రా ప్రవీణ్‌రెడ్డి, ఈశ్వరయ్య, డి.రమేష్, రాములు, కే.రవీందర్‌రెడ్డి, ఎస్.సత్యం, భరత్, జగన్, శేఖర్ పాల్గొన్నారు.

నమ్మకాన్ని వమ్ము చేయం

కోడేరు : విద్యార్థులను తమ కళాశాలలో చదివిస్తున్న తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయబోమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవేణి నరసింహులు అన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణలో మేగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాప కులు పద్మావతమ్మ, రమేష్, ప్రవీణ్, వెంకన్న, రఫీ క్‌పాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య

తిమ్మాజిపేట : ప్రభుత్వ కళాశాల ల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనసూయ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అధ్యాపకులు జయలక్ష్మి, వెం కన్న, వెంకటయ్య, శోభారాణి, తులసి, శంషాద్, విజయలక్ష్మి, జంగయ్య, కిరణ్, ప్రియదర్శిని, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ విభాగం హెచ్చరికల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లాలో వర్షపాతం కారణంగా ఏర్పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ప్రమాదాలు కూడా సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నదులు, చెరువులు ప్రవహించే ప్రాంతాల్లో ప్రజల రాకపోకలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లో కూడా తక్షణమే స్పందించడానికి ప్రధాన కార్యాలయంలో అధికారులు ఎప్పుడూ అందుబాటులో ఉండాల్సినవసరం ఉన్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా అధికారులు సమన్వయంతో ప్రజల రక్షణ కోసం అప్రమత్తంగా ఉండాలని సమన్వయంతో పని చేస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ముసురు వర్షంతో ప్రజల ఇబ్బంది



లింగాల : వాగు వద్ద పహారా కాస్తున్న పోలీసులు

కొల్లాపూర్,సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) :కొల్లాపూర్ పట్టణంలో శుక్రవారం తెల్లవారు జాము నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణ రహదారులన్నీ జలమయమయ్యాయి. పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో సైడ్ డ్రైనేజీ నిండి రోడ్డుపైకి మురు గునీరు పారడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మురుగునీరు రోడ్లపైకి ప్రవహించకుండా సైడ్ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. గ్రామాలలో కూడా వర్షంవల్ల రహదారులు జలమయమయ్యాయి. ప్రజలు రోడ్లపైకి రాలేదు. శుక్రవారం వ్యాపారాలు కొనసాగలేదు.

● కోడేరు : ముసురు వర్షంతో రైతులు దిగులు చెందుతున్నారు. పత్తి, మినుము, పెసర, కూరగాయల పంటలు వేసిన రైతులు ముసురు వర్షం వల్ల పంట పైరులు నీరుపట్టి ఎర్రగా మారడంతో పాటు మురిగిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు పరిశీలించాలని రైతులు కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

లింగాల : ముసురుతో వర్షాల నేపథ్యంలో మండల పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడ్ సూచించారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే మార్గమధ్యంలో గల వాగుల వద్ద పోలీస్ పహారాను ఉంచి ప్రజలు వాగు దాటకుండా చర్యలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాబోయే రెండు మూడురోజుల పాటు భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలున్న దృష్ట్యా వాగులు, చెక్‌డ్యామ్, కాల్వల వద్ద బారికేడ్లు వేసి రాకపోకలను నిలిపివేస్తూ సిబ్బందితో భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో నివసించే ప్రజలను తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. చెక్‌డ్యామ్‌లు, చెరువులు, వాగులు వద్దకు వెళ్లరాదనీ అవసరమైతే తప్ప ఇండ్ల నుండి బయటకు రావద్దని కోరారు. పోలీసులకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఒకటిన పెద్దకొత్తపల్లిలో బతుకమ్మ పోటీలు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దసరా, బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పెద్దకొత్తపల్లిలో అక్టోబరు 1వ తేదీన బుధవారం గాంధీ విగ్రహం దగ్గర బతుకమ్మ పోటీలను మహిళలకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద బతుకమ్మ పోటీల పోస్టర్‌ను కాంగ్రెస్ నాయకులు విడుదల చేశారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి 3గ్రాముల బంగారం, రెండవ బహుమతి 2గ్రాముల బంగారం, మూడవ బహుమతి 1 గ్రాము బంగారం విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తారు. ఒకగ్రూపులో ఖచ్చితంగా ఆరుగురు సభ్యులు ఉండాలని, ఒక గ్రూపు ఒక బతుకమ్మను మాత్రమే చేయాలని, బతుకమ్మ సంబురాల్లో పాల్గొని బహుమతి రాని ప్రతీ గ్రూపునకు 3తులాల వెండిప్రోత్సాహక బహుమతి ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. ఈ పోటీల్లో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ పిలుపునిచ్చారు. సింగిల్ విండో డైరెక్టర్ దండు చంద్రయ్య, నాయకులు అశోక్‌రెడ్డి, టి.బాలస్వామి, బ్యాగరి మల్లేష్, సాయిలు, బాలనారాయణ, శివశంకర్ తదితరులు ఉన్నారు.

సొంత గూటికి బీఆర్ఎస్ నాయకుడు



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ సర్పంచ్ గుండె విజేందర్‌గౌడ్

చారకొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ గుండె విజేందర్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీని వీడి సొంత గూటికి చేరారు. శుక్రవారం మాజీ సర్పంచ్ గుండె విజేందర్‌గౌడ్ హైదరాబాద్‌లో కేటీఆర్ నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కేటీఆర్ విజేందర్‌గౌడ్‌కు బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండలంలో బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తానని విజేందర్ గౌడ్ తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్య

- పెద్దకొత్తపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవేణి నరసింహులు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన ఉన్నత విద్య అందిస్తుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవేణి నరసింహులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులు అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన ఉన్నత ప్రమాణాలతో ఉచిత విద్య లభిస్తుందన్నారు. ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. విద్యార్థుల అభివృద్ధిలో అధ్యాపకుల పాత్ర ఎంతో ముఖ్యమో తల్లిదండ్రుల పాత్ర అంతే ముఖ్యమన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలలకు పంపించాలని ఆయన సూచించారు.

'స్థానిక ఎన్నికలు నిర్వహించని కాంగ్రెస్ ప్రభుత్వం'

వంగూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావిశ్వాసం కోల్పోయిందని, అందుకే ఆ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుకు రావడం లేదని బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు కోట్ల నరేందర్ రావు ఆరోపించారు. శుక్రవారం మండలంలోని పోల్కంపల్లిలో జనగర్జన సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ 22 నెలల పాలనలో ప్రచార ఆర్భాటమే తప్ప ప్రగతి ఏమీ లేదన్నారు. ఆరు గ్యారెంటీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అద్భుత ప్రగతిని సాధించిందన్నారు. ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందన్నారు. ఆదివారం అచ్చంపేటలో జరగనున్న బీఆర్ఎస్ జనగర్జన సభకు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో వెళ్లి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంకు నరేందర్, రేణుగౌడ్, రామస్వామి, శేఖర్, శ్రీను పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి ఆదివాసీ గిరిజనుల సమస్యలు

మన్ననూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 24న భద్రాచలం వేదికగా జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నల్లమల ఆదివాసీ చెంచుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని పీవీటీజీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మల శ్రీనివాసులు, సమన్వయకర్తలు శంకరయ్య, రాజేంద్ర ప్రసాద్, పెద్దిరాజులు తెలిపారు. వారు శుక్రవారం సాయంత్రం మన్ననూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పీవీటీజీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, పీఎంజన్‌మన్‌లో కేటాయించిన ఉద్యోగాలను స్థానిక చెంచులతోనే భర్తీ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగాల్లో పీవీటీజీలకు ప్రత్యేక కోటా ఏర్పాటు చేయాలని, పీవీటీజీలకు కార్పొరేట్ వైద్యం అందించాలని డిమాండ్ చేసినట్లు వివరించారు.

మహిళా ఆరోగ్యమే సమాజ ఆరోగ్యం

- వైద్యాధికారి సంధ్య

తెలకపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహిళా ఆరోగ్యమే సమాజ ఆరోగ్యం అని తెలకపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్య అన్నారు. మహిళలకు కేంద్రీకృత రోగనిరోధక చికిత్స ఆరోగ్య సేవలను అందించడం ద్వారా మాతృ శిశు మరణాల రేటును తగ్గించడం లక్ష్యంగా స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలు ఆరోగ్యవంతులుగా ఉంటే ఆ సమాజం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా 50 మందికి విజన్ టెస్టింగ్, రిఫ్రాక్టివ్ ఎర్రర్స్ (కంటి సమస్యలు) గుర్తింపు, కంటి వ్యాధుల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ నకుల్ వర్మ, వైద్య సిబ్బంది వీర్‌పాల్, అలివేల, పుష్ప, శ్రీదేవి, శ్రవణ్‌కుమార్, రవీందర్‌రావు, సందీప్‌రెడ్డి, రాజు, వెంకటయ్య, రామకృష్ణ, అంజనేయులు, హాజీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీచర్స్ కాలనీలో ఎటు చూసినా
ముళ్లపొదలే..

- లింకురోడ్లు లేక ఇబ్బందులు

- అందని మిషన్ భగీరథ తాగునీరు

- అస్తవ్యస్తంగా పారిశుధ్యం

- టీచర్స్‌కాలనీ 21వ వార్డు దుస్థితి



టీచర్స్‌కాలనీలో వీధి రోడ్డులో పెరిగిన చెట్ల పొదలు

నాగర్‌కర్నూల్‌టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని 21వ వార్డు ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. వార్డులోని టీచర్స్‌కాలనీ, న్యూ టీచర్స్ కాలనీల్లోని ప్రజలు ప్రధానంగా తాగునీరు, సీసీ రోడ్లు, పారిశుధ్య సమస్యలతో సతమతమవుతున్నారు. దాదాపుగా అన్ని వీధుల్లో సీసీ రోడ్లు ఉన్నా వాటికి మధ్య లింకు రోడ్లు లేకపోవడంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. లింకు రోడ్లు గోతులమయమై దట్టమైన చెట్లపొదలతో నిండిపోయాయి. దీంతో పాముల బెడదతో సమీప ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఒక వీధి నుంచి మరో వీధికి వెళ్లాలంటే కాలనీ చివర ఉన్న ప్రధాన రోడ్డులో తిరిగి వెళ్లాల్సిందే. టీచర్స్‌కాలనీలో మిషన్ భగీరథ మంచినీరు చాలా కాలంగా రావడం లేదు. దీంతో కాలనీ ప్రజలు డబ్బులు వెచ్చించి తాగునీటిని కొని తాగుతున్నారు. కాలనీలో చెత్తబండి సక్రమంగా రాకపోవడంతో ఇంట్లో పోగైన చెత్తను బహిరంగ ప్రదేశాల్లో రోడ్ల పక్కనే పారబోస్తున్నారు. దీంతో వాటిలో పందులు, కుక్కలు చేరి పారిశుధ్యం మరింత అస్తవ్యస్తమవుతోంది. అదేవిధంగా న్యూ టీచర్స్ కాలనీలో ఖాళీ ప్లాట్లలో చేరిన వర్షపు నీరు ఎటూ పోకుండా నిలిచిపోవడంతో పెరిగిన దోమలతో అవస్థలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. వార్డు సమస్యలను పలుమార్లు మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని కాలనీవాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి వార్డు వాచ్

మిషన్ భగీరథ నీరు రావడం లేదు



టీచర్స్ కాలనీలో మిషన్ భగీరథ తాగునీటి పైప లైన్ పేరుకే ఉంది తప్ప, వాటి ద్వారా చుక్కనీరు రావడం లేదు. కాలనీలో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టకపోగా చెత్త బండి సక్రమంగా రావడంలేదు. వార్డు సమస్యలను పరిష్కరించాలని మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వీడి కాలనీలో సమస్యలు పరిష్కరించాలి.

- ఎం.పరమేశ్వర్, టీచర్స్‌కాలనీ, నాగర్‌కర్నూల్

అన్ని వీధుల్లో సీసీరోడ్లు వేశాం



వార్డులోని టీచర్స్ కాలనీ, న్యూ టీచర్స్ కాలనీల్లోని అన్ని ప్రధాన వీధుల్లో సీసీ రోడ్లు వేయించాం. మిగిలిన సీసీ రోడ్లకు నిధులు మంజూరీ చేసి నిర్మాణం పూర్తి చేయాలని ఎమ్మెల్యేను కోరాం. వాటికి టెండర్లు పూర్తి చేసి దసరా తర్వాత పనులు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. కాలనీలోని పారిశుధ్యం, ఇతర సమస్యలను మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.

- మాదిరెడ్డి గీతారాణి, తాజా మాజీ కౌన్సిలర్, 21వ వార్డు, నాగర్‌కర్నూల్



న్యూ టీచర్స్‌కాలనీ ప్రధాన రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త